# ఊళ్ళు మేలుకుంటున్నాయి

'ర. చ. న.'



**చీకటికి** పట్టం కట్టి సింహాసనం మీాద కూర్చోపెడితే అది విచ్చలవిడిగా వీర విహారం చేస్తున్నట్లుంది ఆకాశం. కళ్ళు పొడుచుకున్నా కనపడని అమావాస్య చీకటి!

గోడ గడియారం ఠంగ్ ఠంగ్ మని మూడు కొట్టింది.

శివరామయ్య కప్పుడే నిద్రమత్తు వదులుతోంది!

"శివరామయగోరూ, శివరామయగోరూ" అంటూ బయట ఎవరో తలుపులు బాదుతున్నారు.

'ఇంత రాత్రి ఎవరబ్బా' అనుకుంటూ బద్ధకంగా లేచి కూచున్నాడు శివరామయ్య.

అవతల వ్యక్తి ఇంకా తలుపులు బాదేస్తున్నాడు గావు కేక పెడుతూ.

"శివరామయ్యగోరూ, తలుపు తెరవండీ."

"ఆఁ! ఎవరూ—సింహాద్రా! ఏమిట్రా ఈ రాత్రి వేళ!" గొంతు గుర్తుపట్టి లేచి వెళ్ళి తలుపు తీశాడు శివరామయ్య.

ఒక్క కుదుపుతో సింహాద్రి, వెంకాయ లోపలికొచ్చి, మళ్ళీ వెంటనే తలుపు వేశారు.

"ఏమిట్రా, సింహాద్రీ, ఏమైంది? ఎందు కలా రొప్పుతున్నారు? గూడెం పెద్ద లిద్దరూ ఒకేసారి వచ్చేరేమిట్రా? ఏమిటా కంగారు? తలుపు వేశా రెందుకు?" గుక్క తిప్పుకోకుండా ప్రశ్నల వర్షం కురిపించాడు.

"ఏటైందని మెల్లిగా అడుగుతరేంటయ్యా—అవతల కొంప అంటుకుంటా ఉంటేనూ" అన్నాడు సింహాద్రి ఒగురుస్తూ.

"అవునండయ్యా." వత్తాసు పలికాడు వెంకాయ.

"కొంప అంటుకోవట మేమిట్రా? మీా గూడేనికి నిప్పంటుకన్నాదేమిటి?" శివరామయ్య మాటలు తడబడినాయి.

"లేదండయ్యా—రేతిరి సత్తెమూర్తిగోరూ, నేనూ, ఎంకాయ, మన నరిసిగోడు పాలెం నుంచి వత్తా ఉంటే మన వూరవతల సింతల తోపుకాడ దారి కాసి మమ్ముల్ని సితక గొట్టినారండీ. సత్తెమూర్తిగోరికి పానాపాయం లేదంటగాని, నరిసిగోడి బుర్ర రామ కీర్తన పాడిందంటే నమ్మండి. ఇద్దర్ని పాలెం గవర్నుమెంటు ఆసుపత్రిలో ఏసొచ్చినాం. నాకూ రెండు పడ్డాయి లేండి. బగమంతుని దయ వల్ల మే మిద్దరం ఎట్లనో ఆ సీకట్లో తప్పించుకుండాం" అంటూ దెబ్బలు చూపించాడు సింహాద్రి.

శివరామయ్య అవాక్కయి పోయాడు క్షణకాలం!

వెంటనే తేరుకుని—"ఎవ్రరా ఆ పని జేసింది? అవాయ్పాంవిాటవా దౌర్జన్యం జరిపేది!సత్యమూర్తి మహా సాధువే! ఆయన మీాదనా ఈ దమన కాండ! సరే, పాలెం వెళదాం, పద" అని చక చక చొక్కా, పంచా వేసుకున్నాడు శివరామయ్య.

"అంతా ఇసిత్రంగ ఉందదండీ" అని తలుపు తీశాడు సింహాద్రి.

హడావిడిగా వీధిలోకి వెళ్ళారు ముగ్గురూ.

శివరామయ్య ముందు నడుస్తుంటే వెనకాలే సింహాద్రి, వెంకాయ ఆవేశంతో అడుగులు వేస్తు

"మన వూరి వాళ్ళేనంటావురా ఈ పని జేసింది!" గొంతు కాస్త పెద్దది చేసి అడిగాడు శివరామయ్య.

"ఎవుళ్ళో సీకట్లో పసిగట్టలేక పోనావయ్యా. దొంగ నాయాల్లు ఎనకాల నుంచి తీసినారు దెబ్బ! నవురనమున్న మొగోల్లం:ఐతే ఎదట బడాల్సింది. చుడా లొరిసేద్దును కొడుకులకి."

వళ్ళు కొరికాడు సింహాద్రి.

"వర్లేగాని, నువెళ్ళి తొందరగా మన చిన బుడే సాయిబు గుర్రంబండి పట్రా. నేను, వెంకాయ రాముల వారి గుడి దగ్గర ఉంటాము" అన్నాడు శివరామయ్య.

"సిటికెలో తెస్తాను. మీరా రాద్నే కూసోండి." సింహాద్రి పరుగున వెళ్ళేడు.

"అరేయ్, వెంకా! ఈ దుర్మార్గం తప్పకుండా ఆ వెంకట్రాజుదే అయి ఉంటుంది—మరెవ్వరూ ఈ కిరాతకానికి ఒడిగట్ట రనుకుంటా!" మనసులో మాట తేల్చి చెప్పాడు శివరామయ్య.

"మా బాగా సెప్పేరు. ఆడి కట్టాంటి రాచ్చస పన్ను ఎన్నుతో బెట్టిన ఇద్దేనండి!" సమర్థించాడు వెంకాయ, ఎన్ని క్రిమినల్ కేసుల్లో వెంకట్రాజు ఇరుక్కుని ఉన్నాడో గుర్తు చేసుకుంటూ.

గుర్రం మెడలో మువ్వల చప్పుడు అంత దూరంలో వినపడటంతో ఇంకా ఏమేమో చెప్పాలను కున్న శివరామయ్య ఇక మాట్లాడ లేదు.

• • • •

మన ప్రజాస్వామ్య దేశంలో, అందునా మన తెలుగు రాష్ట్రంలో ఒక పల్లెటూరు జంగంపల్లె. పాలెంకు నాలుగు మైళ్ళ దూరంలో ఉంది! పాలెంలో పంచాయతీ సమితి కార్యాలయముంది. కాంటినెంటల్ హోటల్స్ లేకపోయినా, మూడు సినిమా హాళ్ళూ, అయిదు లాడ్జింగులూ నవనాగరికతకు చిహ్నాలుగా ఉన్నాయి! రాజకీయ కుట్రలకూ, రంకు కథలకీ పాలెంలోని లాడ్జింగులు సంకేత స్థలాలు! వాటిమీద ఎలాంటి రెయిడింగ్‌లూ జరగవు. అథవా జరిగినా ఫర్వాలేదు. కష్టమర్స్ పరువు ప్రతిష్ఠల్ని లాడ్జింగు యజమానులే భీమా చేస్తారు. వాళ్ళు సామాన్యులు కారు! వాళ్ళకు చేతకాని అక్రమాల్లేవు. అందుచేత పాలెం ఇంకా వృద్ధిలోకి రావాలని వాళ్ళ తపన! అంతవరకూ పాలెం సమితి పరిధిలో జన సామాన్యానికి కావల్సిన అభివృద్ధి ఏమీ మెత్తు జరక్కపోయినా, ఆ ప్రాంతం రాజకీయ ధురంధరులకు మరో సారి వాగ్దానాలు కురిపించే సదవకాశం రానే వచ్చింది!

పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పూర్తి వివరాలు ఆ నాటి వార్తా పత్రికల్లో ప్రకటించేరు. అంతకు ముందే సమితి కార్యాలయం నుంచి వ్యాపించిన వదంతులవల్ల ప్రజల్లో అంకురించిన ఎన్నికల జ్వరం పరాకాష్ఠకు చేరుకుంది. ఇళ్ళలో ప్రారంభించి రచ్చబండల దాకా ఎలక్షన్ విషయమే చర్చించుకో సాగేరు ప్రజలు.

గత ఎన్నికల సమయంలో నాయకులు ఎలాంటి వాగ్దానాలు చేసి ఓట్లు సంపాదించుకున్నదీ, తీరా అధికారం చేపట్టాక ఆ వాగ్దానాల్ని ఎంత సులువుగా మరిచిపోయిందీ సింహావలోకనం చేసుకోసాగేరు.

జంగంపల్లెలో కూడా రాజకీయ పరిజ్ఞాన మున్న కొందరు పెద్దలు గ్రూపులుగా చీలిపోయి, సర్పంచ్ పదవికి పోటీ చేయబోతున్న అభ్యర్థుల్ని, వాళ్ళ యోగ్యతల్ని విశ్లేషించుకుంటున్నారు.

అలాంటి ఒక గ్రూపుకు శివరామయ్య సారథి!

ఆ రోజు పాలెంకు ప్రయాణమయ్యాడు ఎలక్షన్ గురించిన ఏమన్నా తాజా కబుర్లు తెలుసుకుందామని.

గుమ్మం దిగి వీధిలోకి వెళ్ళాడో లేదో—"నమస్కారం, శివరామయ్యగారూ. ఎక్కడికో బయల్దేరినట్లున్నారు" అంటూ మెరక వీధిలోని శ్రీధరం పలకరించాడు.

"ఆదేవండీ—ఎలక్షన్ సంగతులు తెలుస్తాయేమో నని..." అర్ధోక్తిలో అని ఆగిపోయాడు శివరామయ్య.

"కొత్త విషయాలు, కొత్త పేర్లు వినపడాలని మనం ఆశ పడుతున్నాం. కాని మళ్ళీ ఆ పాత ముఖాలే కొంత రంగు పూసుకుని మనకు ఎదురుపడేలా ఉన్నాయి!" శ్రీధరం నిరాశ పడ్డాడు.

"ఏమోనండీ! నాకు మాత్రం ఏదో మార్పు వస్తుందని అనిపిస్తూంది" అన్నాడు శివరామయ్య ఆశావాదిలా.

"అర్జంటు కాకపోతే కాసేపు మా ఇంట్లో కూచుని వెళ్ళకూడదూ?" శ్రీధరం ఆహ్వానించేడు.

ఇంటికి వెళ్ళగానే శివరామయ్యగారిని కూర్చో పెట్టి—"ఒరే, నాన్నా, అమ్మ నడిగి ఒక గ్లాసుతో మజ్జిగ పట్రా" అంటూ లోపలికి చూస్తూ కేక వేశాడు శ్రీధరం.


అలనాటి చరిత్రలు-ఈనాటి మేటినవలలు



శ్రీ ప్రసాద్ రచనలు
(విజయ సీరియల్స్)

విజయనగర పతనం-1 — 13.00
విజయ నగర పతనం-2 — 12.00
షాజహాన్ — 13.00
సామ్రాట్ శ్రీరంగరాయ — 10.00
లకుమాదేవి (లల్లాదేవి రచన ఆంధ్రభూమి సీరియల్) — 15.00
ఆర్య చాణక్య — 13.50
అప్పాజీ — 12.00
యుగంధర్ — 13.50
రోషనార — 10.00



* అన్ని బుక్ షాపుల్లోనూ దొరుకుతాయి. దొరక్కపోతే కోరిన పుస్తకాల వెలలో ఒక రూపాయి తగ్గించి M.O. పంపితే మిగిలిన మొత్తానికి V.P.లో పంపుతాము!

నవజ్యోతి పబ్లికేషన్స్
ఏలూరురోడ్
విజయవాడ-520 002

"అలాంటి శ్రమ తీసుకోవద్దు, శ్రీధరంగారూ. నే నిప్పుడే టిఫిన్ తిని బయల్దేరాను. అసలు పిలిచిన పనేమిటో చెప్పండి." మొహమాట పడ్డాడు శివరామయ్య.

దాన్నేం పట్టించుకోలేదు శ్రీధరం.

"వంశ పారంపర్యంగా పాలనాధికారం సంక్రమింప జేసుకునే రాచరికాలు పోయినా మన కింకా ఆ ఆన వాయితీ తప్పటం లేదు—ఏమంటారు?" అనుకున్న విషయం ప్రస్తావనకు తెచ్చాడు శ్రీధరం.

"అవుననుకోండి. కాని ఆ ఆనవాయితీని తప్పించ గల నేర్పు, శక్తి మన వోటర్ల చేతుల్లో మాత్రమే ఉన్నాయి" అన్నాడు శివరామయ్య.

"నిజమే గాని, అధికార దాహం, స్వార్థచింతన మన రాజకీయ నాయకుల్లో పూర్తిగా నశించాలి మరి!"

శ్రీధరం అంటూ ఉండగానే కుర్రాడొచ్చి శివరామయ్యకు గ్లాసు అందించాడు.

"ఏమిటండీ—మీ వాణ్ణి ఇంటర్‌లో చేర్పలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు శివరామయ్య.

"మనలాంటి వాళ్ళ కెక్కడ దొరుకుతాయండీ సీట్లు? క్రితం ఎన్నికల ముందు పాలెంలో ఒక జూనియర్ కాలేజీ ఏర్పాటవుతుం దనుకున్నాం. పెద్దల మాటలు నీటి మూటలే అయ్యాయి." నిస్పృహపడ్డాడు శ్రీధరం.

"అందుచేతే మన మిప్పుడు తీవ్రంగా ఆలోచించాలి" అన్నాడు శివరామయ్య ఖాళీ గ్లాసు కుర్రాడి కిస్తూ.

కుర్రా డటు వెళ్ళిపోగానే శ్రీధరం సంభాషణ కొనసాగిస్తూ—"మొన్నటికి మొన్న కురిసిన భారీ వర్షాలకి పూరి చెరువుకు గండి పడితే బాధ్యతగల పెద్దలు చేతులు ముడుచు క్కూచున్నారు. ఆ సమయంలో మన సత్యమూర్తిగారు కల్పించుకుని గండి పూడిపించకపోతే గ్రామం ఏమైపోయేది? అందువల్ల ఆయనకేం ఒరిగింది? ప్రజలంటే అభిమానం కనుక అలా చేశారు. అసలు అలాంటి వ్యక్తికి పాలనాధికారం ఉండాలండీ" అన్నాడు శ్రీధరం.

"సత్యమూర్తిగారికి రాజకీయాలు పడవండీ. ఏది చేసినా స్వచ్ఛందంగా చేయాలన్నదే ఆయన సిద్ధాంతం."

"అలాంటి నిస్వార్థపరుడు గనుకనే ప్రాథమిక పాఠశాల భవనానికి ఇరవై వేలూ, గ్రంథాలయానికి పది వేలూ విరాళం ఇవ్వగలిగేరు. పైగా, ఒక హోమియో డిస్పెన్సరీ నిర్వహణకు తోడ్పడుతూ ప్రజలకు ఉచిత వైద్య సదుపాయం కూడా కలిగించారు."

"ఇంత చేసినా తనేమీ చేయలేకపోతున్నాననే ఆయన భావన, శ్రీధరంగారూ."

"గొప్ప బుద్ధితో చేసే ప్రతి వ్యక్తీ అలానే భావిస్తాడు. సత్యమూర్తిగారు ఈ మారైనా రాజకీయాల్లో చొరవ చేసుకుంటే మన పూరు క్షేమం దన్నా బాగుపడుతుంది."

శ్రీధరం మాటలు పూర్తికాకుండానే శివరామయ్య అందుకుని — "ఇందాక మీరు పాత ముఖాలన్నారు కదా! అయితే ఈ మాటూ వెంకట్రాజూ, ప్రసాదరావూ రంగంలోకి దిగుతున్నారన్న మాట" అన్నాడు ఆరాటంగా.

"సందేహమెందుకూ? ఈ పాటికి నామినేషన్లు కూడా పడేసుంటారేమో?"

"ఏ ముఖం పెట్టుకుని మళ్ళీ ప్రజలముందుకు వెళతారండీ వాళ్ళు? గ్రామంలో రోడ్లు వేయిస్తామన్నారు. కాని మన వీథులు మురికి గుంటల కన్న హీనంగా తయారయ్యాయి. ఎలక్ట్రిసిటీ తెప్పిస్తామన్నారు. ఆ పథకం ఇంకా కాగితాల్లో మూలుగుతూనే ఉంది. లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ అని ఏదో బాకా వేశారు. మెరక భూములు పట్టిపోయాయి. ఏమీ చెయ్యక పోవటమే గొప్ప సేవగా భావించి జనం వాళ్ళకు వోట్లేస్తారంటారా?"

"వేయకపోతే కొంటారు, శివరామయ్యగారూ. మనుష్యుల తలకాయల్నే కాజేసే దుండగులకు మనుష్యుల ఆకలిని కొనేయటం ఏమంత కష్టమైన పని చెప్పండి?"

"కాని, శ్రీధరంగారూ! ప్రజలు డబ్బుకు ఎంత కక్కుర్తి పడినా తల తిరిగిందంటే తమ అభీష్టాన్ని నెరవేర్చుకు తీరతారండీ!"

"అప్పుడు రాజకీయాల రంగే మారిపోతుంది. అంచనాలూ తప్పిపోతాయి! మరి ప్రజల్ని అంతగా ఆకట్టుకోగల వ్యక్తి ముందుకు రావాలిగా."

"వస్తాడు, శ్రీధరంగారూ! తప్పకుండా వస్తాడు."

"వస్తే మంచిదే! అందరికీ మేలు జరుగుతుంది. మనం కోరుకునే దదే కదండీ!"

శ్రీధరం మాటల్ని భంగపరుస్తూ గడియారం పన్నెండు కొట్టింది.

"అరె! బాగా ఎండెక్కిందే! ఇక వస్తానండీ. పొలం వెళ్ళి రాకపోతే మనసులో అదో వెలితిగా ఉంటుంది" అంటూనే ఒక్క వూపులో వీధిలోకి వెళ్ళిపోయాడు శివరామయ్య.

వేగంగా నడుస్తున్నా ఆయన మనసులో శ్రీధరంతో జరిగిన సంభాషణే చర్విత చర్వణమవుతూంది. వెంకట్రాజును, ప్రసాదరావును ఎదిరించే మొనగాడు వూళ్ళో ఒక్క వ్యక్తి లేడా అని ప్రశ్నించుకున్నాడు. కాని ఆ వెనకనే శ్రీధరం సూచన మనసులో సుళ్ళు తిరిగింది. అంతే—శివరామయ్య కాళ్ళు అంత వేగంగానూ వూళ్ళోకి దారి తీశాయి.

● ● ●

"భేష్, బాగుంది, చారీ. ఈసారి సత్యమూర్తి కూడా ఈ రొంపిలోకి దిగాడన్న మాట" అన్నాడు వెంకట్రాజు, తను ఎప్పటి నుంచో ఆ బురదలో పొర్లాడుతున్న విషయం మరిచిపోయి.

"దిగేడంటున్నారా— నాదో చిన్న సవరణ" అన్నాడు రామాచారి యుక్తిగా.

"ఏమిటో అది?"

"సత్యమూర్తి దిగలేదండీ. దింపబడ్డాడు" అన్నాడు చారి తెలివి తన సొంత మన్న పోజులో.

"ఆ దింపిం దెవరా అని?"

"ఇంకెవరండీ? ఆ గుంట నక్క శివరామయ్య గాడే అయి ఉంటాడు."

"వాడా! అయితే భయం లేదు. గుంటనక్క గాడు సత్యమూర్తికి తోడయితే ప్రపంచం తల్లక్రిందులై పోతుం దనుకోకు. మెల్లిగా వాణ్ణి మచ్చిక చేసుకుందాం."

మంచినీళ్ళ ప్రాయం అన్నట్లు చిటికేశాడు వెంకట్రాజు.

"మన వోట్లు చీలగొట్టి తన గెలుపుకొరకే ప్రసాదరావే ఈ ట్రిక్కు చేశాడేమో!" సందేహం వెలిబుచ్చాడు రామాచారి.

"వాడి బొంద ట్రిక్కు! మా ఇద్దరి వోట్లు చీలి ఆ సత్యమూర్తే గెలిచి కూచుంటే! ఇప్పుడే వూహాగానా లెందుకు గాని, శివరామయ్యకు ఎర చూపించి, సత్యమూర్తిని బరిలో నుంచి తప్పిస్తే సరి! ఆ ప్రయత్నం చూడు" అన్నాడు వెంకట్రాజు చతురత ప్రదర్శిస్తూ.

"అయ్యా, రాజుగారూ! అలాంటి సత్ప్రయత్నం మీ అనుమతి లేకుండానే చేశాను. వాడు డబ్బుకు లొంగే ఘటమా — మనల్ని మట్టి కరిపించాలని ఎత్తులేస్తుంటే..."

"మరేం చేద్దామంటావయ్యా!" వెంకట్రాజు విసుక్కున్నాడు.

## వింత అనుభవం ఎలాస్ఫురించింది?

**రెండున్నర** సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన. అప్పుడు మా డిగ్రీ ఫైనల్ పరీక్షలు జరుగుతున్నాయి.

మా గ్రామం నేను చదువుకుంటున్న టౌనుకి ఇరవై మైళ్ళ దూరంలో ఉంది.

మా పరీక్షలకి ముందు మా నాయనమ్మగారికి అనారోగ్యం చేసింది. ఐనా, ప్రమాదం లేదు కనుక నేను పరీక్షలకోసం టౌనుకి వచ్చేశాను. నన్ను పెంచి పెద్దచేసిన మా నాయనమ్మగారంటే నాకు చాలా ఇష్టం. ఆమెకు నేనంటే వల్లమాలినవాత్సల్యం.

ఆ రోజు శుక్రవారం. మరునాడే నాకు ఆఖరు పరీక్ష. శుక్రవారం రాత్రి 11 గంటలకు మా నాయనమ్మగారు జ్ఞాపకం వచ్చి, ఏదో కీడు జరిగి ఉంటుందని మనస్సుకి తోచింది. అదే దిగులు దుఃఖంగా మారి, కొంతసేపు బాధపడ్డాను. ఐనా, ఇలా కీడును శంకించి బాధపడడ మెందుకని నన్ను నేను సోదార్చుకున్నాను.

మరునాడు పరీక్షరాసి, గ్రామానికి వెళ్ళినప్పుడు తెలిసింది—ఆమె అంతకు క్రిందటి రాత్రే, సరిగా పదకొండు గంటలకు మరణించిందని. ఇది యాదృచ్ఛికమా? మనస్సుకున్న అద్భుత శక్తికి నిదర్శనా?

-ఎస్. ఆర్. పడాల, మద్రాసు

"అనే తట్టకుండా ఉందండీ!" చారి నెత్తి గోక్కున్నాడు.

"ఏడిసినట్టే ఉంది నీ మంత్రాంగం! నే చెపుతా, విను. శివరామయ్యకి కొడుకున్నాడు. సత్యమూర్తికి కూతురుంది. వాళ్ళిద్దరికీ రంకు కట్టి ప్రచారంలో పెడితే ఇద్దరి మధ్య పచ్చి గడ్డి భగ్గుమందూ?"

"ఇది సినిమా కాదు, రాజుగారూ! ఎన్నికలు! మనం ఆ పనే గనక చేశామా, దాన్నే అవకాశంగా తీసుకుని ఠక్కున ఇద్దరూ వియ్యంకులై పోతారు. దానితో మన పని ఖాళీ..." కాలికేస్తే వేలికేస్తున్నాడు చారి.

"అయితే సామ దాన భేదోపాయాలు నిష్ప్రయోజనమంటావ్. ఇక దండోపాయమే మనకు అనివార్యం! ఈలోగా శ్రీ కృష్ణరాయబారం లాంటిది ఒక రాయబారం నడుపుదాం. ఆ పాత్రకు నువ్వే సమర్థుడివి" అని చారిని దగ్గరికి పిలిచి చెవులు కొరికాడు వెంకట్రాజు.

తక్షణం సత్యమూర్తిని వెతుక్కుంటూ పోయాడు చారి. ప్రజా హోమియో డిస్పెన్సరీలో అడుగెట్టిన చారిని చూస్తూనే—"నీకేం రోగమొచ్చిందయ్యా?" అన్నాడు చీట్లు రాసే గుమాస్తా.

"మా . . .య . . . రో . . .గం" అన్నాడు చారి నోరు తెరిచి, కాలు చూపిస్తూ.

గుమాస్తా విస్తుపోయాడు.

నోటి వంకా, కాలు వంకా మార్చి మార్చి చూసి, చివరకు కాలిమీద దృష్టిని నిలిపాడు.

"ఒహో!మానని 'యక్సిమా'నా! అయితే ఈ చీటి తీసుకుని లోపలికి దయచెయ్యి..." అన్నాడు గుమాస్తా వెక్కిరింపుగా.

చారి లోపలికి వెళుతూనే—"సత్యమూర్తిగారూ! మీ...రు...మం...దు..." అంటూ నోరెళ్ళబెట్టాడు, ఏదో విడ్డూరం చూసినట్లు.

"అవును, చారీ. ఈ రోజు డాక్టర్‌గారు రాలేదు. నేనే ఇస్తున్నాను మందులు! ఈ వైద్యంలో నాకూ అనుభవముందిలే! ఏమిటి నీ జబ్బు?" సత్యమూర్తి అడిగాడు.

"నా కింకా జబ్బుల యోగం పట్టలేదు లెండి. ఈ ఉత్తరం, ఈ మూట మీ కివ్వమని ఆదేశించారు. మీ ఇంట్లోనే మిమ్మల్ని దర్శనం చేసుకోవాల్సింది! కాని మీ రిక్కడున్నారని తెలిసి, వ్యవధి కూడా లేనందున ఇక్కడికి వచ్చాను. క్షమించండి" అని తెచ్చిన రెండూ అందించబోతూ—"ఇప్పటి కిది ఉంచమన్నారు. ఎలక్షనయ్యాక మరో పదివేలు మీ డిస్పెన్సరీకి విరాళంగా పంపుతామన్నారు. మరి...మీరూ....హి...హి...హిహి!" అంటూ ఇకిలించటమే గాక, చేతులు జోడించాడు వంగి రామాచారి!

"ఏమయ్యా, చారీ! నేను గెలిచి తీరతాననే బెరుకుంటే మీ రాజుగారే స్వయంగా వచ్చి నన్ను కలుసుకోవచ్చుగా! ఈ కుదరని రాయబార మెందుకు? నన్నంత తక్కువగా అంచనా వేసుకున్నాడన్న మాట వెంకట్రాజుగారు! ఇలాంటి పరిస్థితిలో ఇక నేను పోటీ నుంచి విరమించుకోవటం అసంభవమని తెలియజెయ్యి మీ రాజుగారికి" అన్నాడు సత్యమూర్తి తన తిరుగులేని నిర్ణయం ప్రకటిస్తూ.

గుటకలు మింగుతూ అక్కడి నుంచి తోకఝాడించాడు రామాచారి — మనసులో తన పాత్రను అద్భుతంగా పోషించానని ఉప్పొంగిపోతూనే! అవును మరి, తనలాంటి పరభాగ్యోపజీవులు బతకాలంటే రాజకీయాల్లో కీచులాటలకే వూపిరి పోస్తుండాలి!

* * * *

జంగంపల్లె సర్పంచ్‌గా సత్యమూర్తి పోటీలో ఉన్నాడని తెలిసిన జనంలో కనీ విని ఎరుగని ఉత్సాహం వెల్లువికింది. అంతవరకూ వెంకట్రాజు, ప్రసాదరావుల్లో ఎవరికి ఓటు వెయ్యాలా అని సందిగ్ధంలో పడిపోయిన వాళ్ళు ఒక గడ్డు సమస్య పరిష్కారమైపోయినట్లుగా హాయిగా వూపిరి పీల్చుకున్నారు. సత్యమూర్తి పేరు, ఆయన ఫొటో రంగుల్లో ముద్రించిన వాల్‌పోస్టర్లను చూసిన జనం హర్షధ్వానాలు చేశారు. అభిమానులు, కార్యకర్తలు పంతులు వేసుకుని ప్రచారం ముమ్మరం చేయసాగారు. ఆ ప్రచారంలో కొన్ని అపశ్రుతులు వినిపించటం గమనించిన సత్యమూర్తి—"ప్రత్యర్థి వర్గాలను రెచ్చగొట్టే విధంగాను,


## ఇది మీకు బాలాడుపయోగం

మీ నిత్యవ్యవహారాలకు 'వ్యవహారదర్శిని' అనే తెలుగుపుస్తకం మీకుచాలా ఉపయోగం. అందులో ఏదైనాఆస్తికొనేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఏదైనా ఉత్పత్తి, వ్యాపారం చేయాలంటే, దేనికెవరివద్ద ఎలాలైసెన్సు తీసుకోవాలి, వివిధ జాతుల వివాహవిడాకుల నిబంధనలు, స్త్రీపురుషుల ఆస్తిహక్కులు ఎవరితోనైనా ప్రమాదంరాబోతుంటే, పోలీసురక్షణకు ఎవరికెలావ్రాయాలి, ప్రభుత్వఉచిత యిండ్లస్థలాలుపొందటానికి ఎవరికెలా ధరఖాస్తువ్రాసిపంపుకోవాలి, నోట్లుదస్తావేజులు, ఒప్పందాలపత్రాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, ఉత్తరాలు ఎలావ్రాయాలి, వాటివివిధనమూనాలు, అనేకచట్టాల వివరాలు, ఇలాంటివెన్నో మీకుపయోగపడేలా, తెలిసేలా వ్రాయబడ్డాయి. 300 పేజీలపుస్తకం. ధర రూ: 12. పోష్టుఖర్చులదనం. దేశసేవప్రచురణలు, 2. ఇందిరానగరునెంగలరావునగరుటాంకు సమీపాన, హైదరాబాదు-890 కు ఉత్తరంవ్రాసి మీఉపయోగానికోపుస్తకం వి.పి. పోష్టుద్వారా వీలయినంత త్వరగా పొందండి



## ఇంటి సినిమా యంత్రం

**(SILENT MOVIE)**

**ధర రూ. 150**



సినిమా ఫిలిం రీళ్ళు కూడా మా వద్ద లభ్యమౌతాయి. ప్రొజెక్టర్ మరియు సినిమా ఫిలిం ధరల జాబితాకు సమగ్ర కేటలాగ్ పుస్తకానికిగాను రూ. 2 30 కు పోస్టేజీ స్టాంపులు లేదా ఎం. ఓ. పంపండి ఇంగ్లీషులో మాత్రమే వ్రాయండి.

ఉత్పత్తి దారులు :

**FILM COMPANY**

(Established 1967)

Post Box No. 269

3, Thillaichidambara Nadar Street,

SIVAKASI-626123 Tamilnadu.

కించపరిచే పద్ధతిలోను ప్రచారం తీవ్రతరం చేయవద్దు'' అని తన శ్రేయోభిలాషుల్ని సవినయంగా కోరాడు.

కాని ఎవరూ ఆయన ఉపదేశాన్ని పాటించలేదు—చివరకు శివరామయ్య కూడా.

''సత్యమూర్తి గారూ! ప్రజావాహిని ఉత్సాహంతో ఉరకలు వేస్తోంది. యువకులూ నడుం కట్టారు. సాగుతున్న చైతన్య రథాన్ని ఏ శక్తీ ఆపలేదు! మనకు విజయం తథ్యం!''

శివరామయ్య మరో ప్రపంచపు సుందర స్వప్న సౌధాన్ని సాక్షాత్కరింప చేశాడు సత్యమూర్తి కళ్ళ ముందు.

'ఈ దేశంలో నిజంగా ప్రజాస్వామ్య సౌధాన్ని ఆయన చెప్పినంత సుందరంగా నిర్మించగలమా' అనుకున్నాడు సత్యమూర్తి.

* * * *

''సత్యమూర్తి జిందాబాద్!''

''సర్పంచ్‌గా సత్యమూర్తి గారినే ఎన్నుకోండి.''

''ప్రజానాయకుడు సత్యమూర్తి...''

''జిందాబాద్!''

''మీ వోటూ...''

''బాణం గుర్తుకే...''

''సత్యమూర్తి జిందాబాద్!''

''ప్రజాద్రోహులను...''

''వోడించండి.''

''కార్మిక కర్షక హంతకుల్ని...''

''మట్టుపెట్టండి.''

''సత్యమూర్తి...''

''జిందాబాద్.''

వీధి తలుపులు మూసుకుని ఇంట్లో కూచున్న వెంకట్రాజు చెవులు నినాదాల హోరుతో చిల్లులు పడుతున్నాయి. జయ జయ ధ్వానాలతో ఝంఝా మారుతంలా సాగిపోతున్న ప్రజావాహినిని చూడగానే కిటికీ తలుపులు దబ్బున మూసేశాడు. అంతవరకూ ప్రజలమీద ఉన్న నమ్మకం, విజయం తనకే తథ్యం అన్న విశ్వాసం సడలిపోసాగాయి. బెదిరించీ, డబ్బిచ్చీ కొనుక్కున్న ప్రజాదరణ గిట్టుబాటు కాకుండా పోతుందన్న అనుమానం పెనుభూతంలా పట్టుకుని హృదయాన్ని పిండేస్తోంది!

వెంకట్రాజుకు మనశ్శాంతి లేదు. సత్యమూర్తి పట్ల అసూయా ద్వేషాలు రగులుతున్నాయి! అంతవరకూ తను సుస్థిరం చేసుకున్న అధికార పీఠాన్ని సత్యమూర్తి తన్నుకుపోతాడన్న నమ్మకం ప్రబలమవటంతో, రగిలిన ఈర్ష్యాగ్ని జ్వాలగా ఎగసింది!

ఆ జ్వాల ప్రతీకారాన్ని ప్రేరేపించింది!

ప్రతీకార వాంఛ ప్రకోపించగా, వెంకట్రాజులో ఆఖరుగా మిగిలింది పాశవికత మాత్రమే!

ఆ పాశవికత అతని మనసులో కార్యాచరణగా రూపు దిద్దుకోవటానికి ఆట్టే సమయం పట్టలేదు.

* * * *

''ఏం సత్యమూర్తిగారూ, ఇప్పు డేమంటారు?'' అన్నాడు శివరామయ్య మీసంపైకి చేయి పోనిస్తూ.

''దేన్ని గురించండి?'' సత్యమూర్తి తెలినట్లు అడిగాడు.

''మీరూ మా గొప్ప చమత్కారులే సుమండీ.''

''మన గెలుపును గురించేనా మీరు మీసం దువ్వుతుంది?'' అన్నాడు సత్యమూర్తి ఇంకా ఉడికించటం ఎందుకని.

''ఒకటేమిటండీ, రెండు మీసాలూ దువ్వుతాను. అవసరమనుకుంటే మీసాల్ని బొద్దుగా పెంచి గుండ్రాళ్ళను నిలబెడతాను.''

శివరామయ్య ఉత్సాహానికి అవధుల్లేవు.

''ఎందుకండీ, ఈ మాత్రానికే ఉబ్బి తబ్బిబ్బు కావటం? నీసిగ్గి పేరిపోయిన జనం కన్ను తెరిచిన సదాలనుకున్నారు. మనకు వోట్లేశారు. ఇప్పుడు మన బాధ్యత బాగా పెరిగిపోలేదూ?''

''ఇదివరలో మీరు ఏ బాధ్యత లేకుండానే మన వూరి కోసం ఎంతో చేశారు. ఇప్పుడు మరింత సేవ చేసే అవకాశమిచ్చారు జనం! మీ మీద పూర్తి విశ్వాసంతోనే కదా!''

''నిజమే, శివరామయ్యగారూ! కాని ప్రతి మంచి పనికీ ప్రోత్సాహం ఎంత ఉంటుందో, దానికి వ్యతిరేకతా ఉంటుంది. మనం ఏం అపకారం చేశామని వెంకట్రాజు నా మీద దౌర్జన్యం చేయించాడు? అతని ప్రవృత్తి జనాన్ని కాల్చుకుతినటం! పేద ప్రజల శ్రామిక శక్తిని దోచుకోవటం! మనం వాళ్ళని ఆదుకోవాలి! అతని చర్యలను నిరోధించాలి! ఇవన్నీ సంభవాలే కదా! అంటే ఘర్షణ! వర్గ పోరాటం! హింస, ప్రతిహింస! మన దేశంలో రాజకీయ వ్యాసంగమంతా ఆ పంథాలోనే సాగుతోంది! నిజానికి ప్రజాస్వామ్య విధానంలో ఆ పంథాకు స్థానం లేదు. కాని ప్రజాస్వామ్యం మన నాయకుల ఉపన్యాసాలకు పనికొచ్చే ముడిసరుకుగానే ఉపయోగపడుతోంది. ఇంకెంతకాలం పడుతుందో పరిపూర్ణ దశను చేరుకోవటానికి?''

సత్యమూర్తి తన రాజకీయ అవగాహన వ్యక్తపరిచాడు.

శివరామయ్యకు ఆశ్చర్యం కలిగింది.

''ఏమో అనుకున్నా గానీ, మీరూ రాజకీయ విద్వాంసులే! ఇక నాకు దిగుల్లేదు'' అన్నాడు శివరామయ్య ఛాతీమీద చరుచుకుంటూ.

''ఇప్పుడేం దిగుల్లేదులెండి! ముందుంది ముసళ్ళ పండగ'' అన్నాడు సత్యమూర్తి నవ్వుతూ.

''ఏం భయం లేదు. ప్రజలు తెలివిన పడ్డారు. ఒక్క మన వూరే కాదండీ, మన సమితిలోని మూడు వంతుల గ్రామాలు పాతను పాతిపెట్టేశాయి! మీకు తెలుసుగా! కొత్త నీరు పారుతోంది. అంటే ఏమిటి అర్థం? వూళ్ళు మేలుకుంటున్నాయన్న మాట. అన్న మాటేమిటి? వూళ్ళు మేల్కొన్నాయి! వూళ్ళు మేలుకుంటున్నాయి...మేలుకొంటున్నాయి.అహ్హహ్హా!'' అంటూ పొంగి పొర్లుతున్న ఉత్సాహాన్ని ఆపుకోలేక దాదాపు నృత్యం చేస్తున్న భంగిమలో నివనివ వెళ్ళిపోతున్న శివరామయ్య వైపు తృప్తిగా చూస్తూండిపోయాడు సత్యమూర్తి. *

# భారత దేశం

తమిళ మూలం: సుబ్రహ్మణ్యభారతి. తెలుగు సేత: చల్లా రాధాకృష్ణశర్మ.

( భారతి తమిళ నవయుగ ప్రవక్త. అఖండ భారత దేశాన్ని దర్శించిన నిష్కళంక దేశ భక్తుడు. భారతదేశపు సమగ్రతను బహు విధాల కీర్తించాడు. సమైక్య భారతమే ఆయన ధ్యేయం. తెలుగు పాట పాడుతూ సింధు నదిలో నౌకావిహారం చెయ్యాలి, రాజపుత్ర వీరాగ్రణులకు కన్నడదేశపు బంగారం కానుకగా ఇవ్వాలి, కాశీలో జరిగే చర్చలు కంచిలో ప్రతిధ్వనించాలి ఇలా ఆయన కలలు కన్నాడు. భారతి శతజయంత్యుత్సవాలు ప్రారంభమయినాయి. మన దేశంలోనే కాక రష్యాలో సైతం ఆయన శతజయంతిని జరపాలని సన్నాహాలు జరుగుతున్నాయి. )

రజత హిమాద్రిని విహరించేము
కడలిని వోడలు నడిపేము
బడినేమో గుడిగా మలిచేము
భారతమంటూ బుజాలు చరిచేము.
సింహళానికి సేతువు కట్టేము
సేతువు నేమో వీధిగ తీర్చేము
వంగదేశం మిగులు నీటితో
మధ్యదేశంలో పైరు చేసేము.
సింధునదిని పండు వెన్నెలలో
చేర దేశపు నయసు కన్నెలతో
తేట తెలుగులో పాట పాడుతూ
పడవ నడిపీ తిరిగి వచ్చేము.
గంగాతీరపు గోధుమ పంటను
కావేరి తమలపాకులకు మార్చుకునే ము
సింహ తుల్యులు మహారాష్ట్రుల కవితకు
చేర దేశపు దంతం బహూకరించేము.
కాశీపండితులు చేసే చర్చలు
కంచిలో వినిపించేటట్లు చేసేము
రాజపుత్ర వీరాగ్రణులకు
కన్నడపు బంగారం కానుకగా యిచ్చేము.
ఆయుధాలు చేసేము కాగితం చేసేము
కర్మాగారం కళాయతనం నెలకొల్పేము
అలసత్వం విడచేము తల యెత్తుకు తిరిగేము
నిజం చెప్పేము పెక్కు పనులు చేసేము
జారులు రెండు తప్ప మరేమీ లేవని
చెప్పిన కవయిత్రి మాటలు అమృత మనేము
నీతి పథాన నడుస్తూ పరులకు తోడ్పడే
బుజావర్తనులే పైవారు, కిందివారు పెరవారు.

డా. సి. ఆర్. శర్మ

సుప్రసిద్ధ ప్రాచీన తమిళ రచయిత్రి అవ్వైయారు. ★